


# ఉరుములు _ మెరుపులు

శ్రవ్యనాటిక :

పాత్రలు:—

సీత:— గృహిణి

జానకిరామయ్య:— గృహస్థు — గుమాస్తా ఉద్యోగం — బస్తీలో

విస్సాయి:— కొడుకు — 11 సం — 2 ఫారం

రాజు:— జానకిరామయ్య తమ్ముడు — ఇంటర్

జా: (వస్తూ అతి తొందరగా) ఏమేవ్, ఏం చేస్తున్నావు

సీ: (లోపల నించీ) ఇదుగో ఇప్పుడే చెంబులు తోల్తాను. . . .

జా: (ఆర్ద్రోక్తిలో) అడుగుతుంటా ఏమి చేస్తున్నావూ అని

సీ: (తాపీగా) ఎందుకూ ? విస్సాయికి చద్దన్నం పెడదామని. . .

జా: (ఆర్ద్రోక్తిలో) (అతివినుగ్గా) అబ్బబ్బబ్బ... చేసిన పనీ, చెయ్యబోయేపనీ చెప్తావుకాని చేస్తున్నపని మాత్రం చెప్పవుగదా. . .నీకున్న రోగమే ఆదిగా!

సీ: (గట్టిగా) అయితే సరిగ్గా చేస్తున్నపనే చెప్పమంటారా ?

జా: ఎందుకూ ?

సీ: గిరాటు కొట్టిన చెంబులికి సొట్టలేస్తేవ పడితే సావకాశంగా తీయించుకుందుకు.

జా: దానికోసమే ఇందాకటి నించి తల బద్దలు కొట్టుకుంటున్నాను.

సీ: పాపం. . . . . అయితే వినండి (నిశ్చిత కంఠం) ఇదుగో కుడి కాలు గడప అవతల వుంచాను. ఎడమకాలు గడప ఇవతల వుంచాను. . . . , కడిగిన కంచంలో నీళ్ళ వొంచుతున్నాను. . . సరేనా ?

జా: (వెర్రికోపంతో) నాకు తిక్కగారి వచ్చిందంటేనా కంచాలూ పళ్లేలూ గిర్రున గిరాటు కొడతాను వీధిలోకి.

సీ: (యధాలాభంగా) గిరాటు కొట్టి అలా వెళ్లి కంచరి సీతారామయ్య కొకసారి కబురు పెట్టండి.

జా: (దిగజారిపోయి) ఏమి వేళాకోళంగా వుంది ?

సీ: (ఉస్సుమని) లేకపోతే ఏమిటా చిరాకు చెప్పండి (కొంచెమాగి దగ్గరపా వచ్చి) నామాట విని దేనికి మీరు హైరానపడి నన్ను హైరానపడతారు ?. . . . .ఒక్క పిసరు కాఫీ కాస్తామ మీరు మాత్రం. . . ముక్తసరిగా పుచ్చుకోండి ఈ ఆగ్రహాలూ. . .ఆవేశాలూ, మిహాలూ చిందులూ అన్నీ చల్లబడతాయి. . .మరి విశ్వ

తరబడి ఒంట బట్టిన కాఫీ ఒక్కనాటితో దులిపేసుకుందామంటే ఇల్లు ఇట్లాగే నరకం కింద తయారు కాదూ ?. . . అవిగో పేగులు 'కాఫీ' 'కాఫీ' అని అరుస్తున్నాయి. తీర్మానాలకేమిలేస్తురూ. . .రండి రండి. ..

జా: (ఖచ్చితంగా) అదుగో. . .అవాటే అనవద్దు కాఫీలు మానేదాం అని నిర్ణయించుకొన్నాం ...ఇక ముట్టేదిలేదు. . .ప్రళయం రానీ—

సీ: (లోపలికి వెడుతూ) ప్రళయం రానే వచ్చింది వస్తోంది కూడా. . .రోజుకోసారి. . .కాఫీ టయిము కల్గా.

విస్సాయి: (ఎక్కణ్ణించో వొచ్చాడు) కాఫీలో విటమిన్లు తక్కువట. . . నాన్నారు చెప్పారు పోనీ నాన్నా 'ఏ' టు 'జడ్' విటమిన్లన్నీ బజార్లో నేరుగా కొనేస్తే ?

జా: ఏమిట్రా నీసొదా ?

సీ: ఇంతకీ మీకు కావాలిసిందేమిటోచెప్పకనే పోలిరి ?

జా: (సాలోచనగా) ఏమిటో నాకూ గుర్తులేదు.

సీ: బావుంది కదూ. . . చూడండీ ఈ విస్సిగాడు ఎలా మారాము చేస్తున్నాడో. . .చద్దన్నం తినడట (నవ్వుతో) కాబోయే డిప్టీకలెక్టరుకి కాఫీ అయినా పొయ్యాలట. . .ఇప్పటికే. రోజుకి రెండు వధటలయినయ్యా. ఉదయం పది గంటలకొకటి. రాత్రి ఏడింటి కొకటి, ఇహను మూడోసారి కరకర ప్రొద్దు పొడవగానే కుంపటి వెలిగించి అత్తెసరు పడెయ్యాలి గావును (విసుగ్గా) అబ్బ యమచర అయి పోయింది నాకు.

జా: ఒరేయ్ విస్సీ... తన్నుమంటావా వెధవన్నా.

వి: ఒయస్ (చట్టున) అదేమిటి నాన్నా కాఫీ మానేసి అన్నం తినమన్నావుగాని వేడి కాఫీ మాని చల్లటి అన్నం తినడమెట్లా ?

జా: ఏడిశావులేరోయ్ వెధవలా జికర్కానువ్వును... నోరుమూసుకుని అన్నం తింటావా తినవా ?

వి: (అడకువుగా) నోరు మూసుకుంటే అన్నం తినడమెట్లా నాన్నా. . .ముద్దముద్దకీ తెరవాలాయె.

జా: ముక్కలు విరగ్గొట్టు రాలుగాయి వెధవాయిని.

సీ: (నవ్వుతో) కార్లోవెళ్ళే కాబోయే డెప్టీకి కాళ్ళు విరిగితేమటుకేమిటి ?. . . ఒరేయ్ చప్పున అన్నం తిని మల్లయ్యగారి రైస్ మిల్లుకి వెళ్ళి బియ్యం రిక్షామీద పట్టుకు రావు నాన్నా ?

వి: ఓ యస్. . .కాతాలో రాయించనా రెడీక్యాష్ పట్టుకెళ్ళనా నాన్నా ?. . .వస్తా. . . జాన్ గారి రేడియో వినాలి. పిల్లల ప్రోగ్రాం. . . టైమెంతా ? . . .(పోతాడు).

జా: రెడీక్యాష్ కూచుంది. . . ఇవాళ ఇరవయ్యో తారీఖోయ్ నాగన్న! (గప్పున స్ఫురించి) అన్నట్లు ఫస్టు తారీకునే గదూ అరబస్తా తీసుకొచ్చాము ?

సీ: అవును.

జా: ఇరవయ్యో తారీఖున మళ్ళీ తెప్పిస్తున్నావేం దేనికి ?



రచయిత

సీ: అయిపోయినై.

జా: (పాశ్చర్యంగా) అయిపోయినై ? బియ్యం ? అప్పుడే ? ప్రతి నెలా అరబస్తానేగదా తెప్పిస్తుంట ? (సాలోచనగా) మరి ఫస్టుతారీఖు తరవాత మన ఇంట్లో జనాభా ఏమి పెరిగిందబ్బా — ఒక చుట్టం పక్కం వచ్చిన జాడా లేదాయెను. . . . .

సీ:— (కొట్టొచ్చినట్లు) అంటే నేను చాటుగా అమ్ముకున్నానని అనుమానమా?

జా:— చా .... చా .... లక్ష్మీందేవి తునకలాంటి మనిషివి. నిన్ను అట్లాంటి అనుమానాలకి గురిచేస్తానా?

సీ: లేకపోతే ఏమిటి మీధోరణి? (కొంచెమాగి) అయినా ఈమధ్య మరీ ఈలలువేయుడం ఎక్కువయింది లెండి మీకు.

జా: అంటే?

సీ: (నిందాగర్భంగా) దొడ్లో పులుసుముక్కలు పారేసి వున్నాయేమిటి? కంచాలచుట్టూ అన్నన్ని మెతుకులా? చొక్కా రెండురోజులకే మాసిందీ? ఏమిటీ ఆరాలు? ...చూడగా చూడగా ..... ఈశకలన్నీ ....

జా: (అహోద్రిక్తతో) దరిద్రగొట్టు లక్షణాలంటావు? అవునా?

సీ: మీరే అనేశారూ?

జా:— నీదగ్గరనుంచి అట్లాంటి యోగ్యతా పత్రం తెచ్చుకున్నానూ అందే బాగుపడే శుభసూచనలవుపిస్తున్నాయన్నమాట నాకు.

సీ:— ఏమో?

జా: మాతాతయ్య అనేవాడులే .... 'లోభి' అనిపించుకున్నాడూ అంటే గృహస్థు బాగుపడ్డాడన్న మాటే అని.

సీ: అదికాదులెండి. నాకు తెలుసు. మీరిచ్చిన డబ్బులలోనించి నేనేదో మిక్కుతున్నానని లోలోపల పీకుతోంది మీకు అవునా?

జా: (బెదురుగా) అదుగో భుజాలు తడుముకోవద్దు.

సీ: (రోషంగా) అంటే నేను గుమ్మడి కాయల దొంగనా?

వి: (వస్తూ) కాని నాన్నోయ్. అట్లాంటి 'ఫండ్' ఒకటి గుట్టుగా ఉంటేనేగాని 'ఆయిస్ఫ్రూట్'కనీ 'మేటినీ'కనీ అమ్మని బెల్లించేందుకు వీలూ సాలూ లేకుండా పోతోంది నాన్నా.

సీ: ఒరేయ్. తోచనివేమిట్రా?

వి: ఒయస్. జాన్‌గారింటో రేడియో మోగడం ప్రారంభించగానే ఇంటో వాళ్ళంతా వాగడం ప్రారంభిస్తారేమే? ఎక్కడలేని కబుర్లూ ఇప్పుడే! ఛేస్. ఒక్క రేడియో అయినాలేదు మనింట్లో. కాబోయే డెప్టీకి పట్టింది ఖర్మ. వస్తా (నిష్క్రమణ)

జా: ఇదుగో చూడు సీతా. మనమేమి అయిశ్వర్యవంతులం కాము—జుట్టు విరబోసుకుందుకు. అదిగో మొహం చిట్లిస్తున్నావు. అక్కడే వస్తుంది నీతోచిక్కు (అంతర్యంగా) మనలో మనమాట. అన్నానని కోపం వద్దు మరి.

సీ: చెప్పండి సందేహమెందుకూ?

జా: (నిందాగర్భంగా) ఇదివరకు కూరలు రోజూ అరవీసెడు కొనేదానివి కదా ఇప్పుడు మూడు సవాసేర్లు దేనికి చెప్పు? ఒకవేపున ఖర్చు దించాలని నేనా? పెంచాలని నువ్వా?

సీ: (నవ్వుతో) ఎవరేనా నవ్విపోతారు. వూరుకొండి కాఫీలు మానుకున్నామా? మరి—

జా: (అరోద్రిక్తిలో) అద్గదీ. నేను కూరలలోకి వెడతే నువ్వు కాఫీలో దూరు.

సీ: (విసురుగా) హాయ్యోరామ. వినరేమండీ. కాఫీలు మానగానే రెండుపూటలు భోజనాలు మూడు పూటలయినై మీకు తెలియదు. ఇకసరే పచ్చళ్ళుమాని రోజూ ఒక్కకూర చెయ్యమని మీరే అంటిరి. మరి పైకం లేక ఈయేడు వూరగాయలే మానేస్తిమి. ఇక కొత్తగా ప్రారంభించిన చద్దన్నాలలోకి ఆధారమేమిటి పిల్లలకి? అంచాత కూరలు కొంచెం అదనంగా కొనాలిసి వస్తోంది. ఏమి చేసేది?


జా: అట్లా అన్నావు బావుంది. పిల్లల్ని డొక్క మాడ్చుమంటానా? (పస్తాయిస్తూ) ఇంతకీ.. (నసుగుతాడు)

సీ: బియ్యం ఇరవయ్యో తారీఖుకే అయినందుకు సంజాయిషీ రాలేదంటారు?

జా: అబ్బ సంజాయిషీ కాదోయ్. చూడు మనకి వందరూపాయిలు జీతం. అవునా? అంతా

**కొనకళ్ళ**

**వెంకటరత్నం**



ఉత్తర ప్రదేశ్ కుమాయిన్ పర్వత దృశ్యాలు —యం.సి. త్రివేది

అందులో ఇమడాలి (కచ్చితంగా) ఇమిడి తీరాలి. ఎంచాతం టే మనకున్న భూములల్లా రుద్రభూములు. ఉన్నకాస్తా సరస్వతీదేవికి నైవేద్యం పెట్టేశాం. అవిణ్ణి ధ్యానించగా ఆవిడ అక్కర్యు ప్రత్యక్షమయింది ఇంటో 'పెద్దావిణ్ణి నేనూ' అంటూ. మరి వేడల మీద మిద్దెలమీద మనకొచ్చే అయినేజులు చెప్పనే అక్కర్లేదుగదా.. అంచాత (తుంచేస్తు) సరిపెట్టుకోవాలి.

సీ: నాకామాత్రం డబ్బువిలువ తెలీదంటారా? కాని ఎట్లా సరిపుచ్చేదీ అని?

జా: (నిష్కర్షగా) ఆవాదనే పనికిరాదు చెట్ల క్రింద బ్రతికే వాళ్లనిచూడు.

వి: (ఎప్పుడొచ్చాడో) చెట్లక్రింద వాళ్లని తీసి పారేస్తావేమిటి నాన్నా. చెట్లకింద గాలి వేస్తుంది ఆరోగ్యంగా. మనగది ఉంది చూశావా ఆందులోకి స్టైడుకాలవ వాసన వస్తుంది మొదట. గాలి వెనక్కాల దిగడి పోతుంది.

సీత: ఉండరా గోల.

వి: ఓ యస్ వస్తా. (నిష్క్రమణ)

సీ: మరి కాఫీలు మానింతరువాత ... పిల్లల్ని అనుకుంటే దిష్టి తగుల్తుందని చెప్పలేక పోతున్నా. నిజానికి అందరమూ అంతో యింతో అదనంగానే అన్నం కతుకుతున్నాం. (నిట్టూర్పు — రవంత గద్గద) ఈనాటికి నాకొంపలో పిల్లలు అన్నమెక్కువ తింటు న్నారని లోలోపలే అనుకోండి, మధనపడాలి సిన దుర్గతి పట్టింది.

జా: అదుగో .... ప్రారంభించావూ? ఒకసబబూ సందర్భమూ లేదు. సాధనమేమిటీ అన్న ఆలోచనాపాలోచనా? సంప్రదింపా? చట్టా బండలా? చూస్తున్నాగా. దారి దొరుకు తుందేమోనని ఆరాతీస్తినా, ఇక రగడలోకి దిగుతుంది. నేను మబ్బులురిమినట్లు ఉరమా, తనేమో కన్నీటి జల్లులో కరిగిపోనూ..సంసార మిట్లాగే గానుగ సాగరముంది. (కొంచె మాగి) ఇంతకీ కాఫీలుమానితేకలిసొచ్చిందెంతా అని? (ఆలోచనలో పడతాడు)

సీ: ఏమోూ మరి. కాఫీపొడుం, పంచదారా, పాలూ ఒకవేపూ, అదనపు బియ్యం, కూరలూ, నూనె మట్టీ, మశానమూ మరొక తట్టునా తూకాల వేసుకొని తీరిగ్గా లెక్కలు వేసుకోండి. అవతల పొపుమాడిపోతోంది. ఇంకానయం భగ వంతుడు వందరూపాయలతో సరిపెట్టాడు.

వి: రెండువందలయితే లెక్కపెట్టలేక చచ్చే వాళ్లం.

సీ: ఆలెక్కలూ డొక్కలూ మీరే చూచుకోండి బాబు. ఇదిగో తాళం చెవి. నేను ఎప్పుడు దేనికి ఎంతకావాలంటే అంతా అడగుతాను. తీసికొంటాను.

జా: (నవ్వి) మళ్లీ మొదటికొచ్చావూ? లెక్క నాదగ్గర ఉన్నన్నాళ్లూ నన్ను నిలబెట్టి అడిగే డానివి గుర్తులేదూ?

సీ: (రోషంగా) నిలబెట్టి అడిగేదానినట! .... పాలబాకీ చూపించి సిగరెట్లకెంతయిందని అడిగాను!

జా: అంతేలే అంతేలే. 'కాపరాని కొచ్చిం తరువాత ఒక్కచీర పట్టుకొచ్చారూ? చిన్నమెత్తు బంగారం కొన్నారూ?' అని సాధించేదానివి!

స: (కోపంగా) అందుకనేగా రోగం కుదిర్చారు.

జా: ఏమిచేశాను?

సీ: జీతమంతా నాకిచ్చి సరిపెట్టమన్నారు!

జా: నీనోటివాక్కు చల్లగా అంతా అన్నావు కదా కొంతకాదుకదా అప్పుడేమో జీతమయి పోయిందీ అంటే నేను సిగరెట్లు తెగతాగు తున్నానని అనుమానం నీకు.

సీ: ఇప్పుడేమో జీతమయిపోయిందని నేనంటే నాలుగురాళ్లు రహస్యంగా పిక్కి చీరలు కొంటున్నానని మీకనుమానం.

జా: అదీకాదు. ఇదీకాదు. ఈదెబ్బతో నాసిగ రెట్లూ తగ్గినై. నీచీర ఘోషా తగ్గింది... బస్తీకి బదిలీఅయిందిగా.

సీ: నాకీ పెటకమెందుకు బాబూ మీలెక్క మీరే చూసుకోండి.

జా: (చటుక్కున) ఇదిగో అదిమాత్రం నావల్లకాదు. జీతం వచ్చీరాగానే అణాపైసలు దేఫీలు నీ చేతిలో పెట్టాలిసిందే. నాకంటావా, చింత కాయపచ్చడీ, మెతుకులూ, పెట్టు చాలు. (చమత్కారంగా) ఎప్పుడేనా, కుతిగావుంటే ఒక సిగరెట్టుముక్కా కాగంటే బొత్తిగా హోటల్ వాసన తగలక నాలిక మరీ చచ్చు బడి పోతుంటే ఎప్పుడేనా ఓ రవదోసెకనీ, రెండుబజ్జీలకనీ ఒకబేడ డబ్బులు నిన్ను బెల్లించి లాక్కుపోగలను.

సీ: చాల్చాలువూరుకోండి.ఎవరేనా వింటే పెళ్లాం మాట శిలాక్షరమీయనకి అనుకునేరు.

జా: కాదా యేం ?

సీ: ఆఁ — మీధిమాకేలూ, ధూంధాములూ ఎవ రికి తెలుస్తాయీ? అన్నట్టు మీ పొదుపు వుద్యమంలో కాఫీహోటలు మానడమొక టయింటుంకదూ? నామాట విని ఎప్పుడేనా ఏమేనా కావలిస్తే మీరే హోటలుకి పొండి. అంతేగాని ఇంట్లో పురమాయించకండి ఏదో మిగులుస్తున్నట్టు.

జా: ఆదేమిటి. హోటల్లో అయితే — ఒక అయిటం తీసుకో ఇడ్డెన్ అణా మారి దేవుడు మేలు చేస్తే—

సీ: (అర్థోక్తిలో) అబ్బ సోది. అన్నీ తలిశీలుగా వివరించాలి మీకు. ఇంటో అయితే రెండు ఇడ్డెన్లతో సరిపోతుందిటండీ? రెండువాయిలు వెయ్యాలి. పిల్లలు గుక్కిళ్లు మింగుతూ చూస్తుంటే నోట్లో వేసుకున్నది విషఘటి కలా ఉంటుంది నాకు. గొప్పకి పోవాలని కాదు.

జా: అర్థమవుతుందిలే — అర్థమయిందిలే— కాఫీలు మళ్లీ ప్రారంభిస్తేనే బావుండేలా వున్నదే (సాలోచనగా) పూరగాయులు అద

నికి పెట్టకనేపోతిని.

వి: (వచ్చి) కాఫీలో మళ్ళీ విటమిన్లు ఎక్కువవుతున్నాయేమిటి నాన్నోయ్? ... ఈమధ్య తగ్గినై గదా? ఇంకా నయం కాఫీమానాను కాని, మానతానని ప్రతిజ్ఞ చెయ్యలేదు నాన్నారికి మల్లే. తీరా ప్రతిజ్ఞ చేశానూ అంటే ఉపసంహరించుకోవాలంటే చచ్చేచావు. నా కభిమానం! బాబా కాబోయే డెప్టీకి ఒక మాట ఒక బాణము.

జా: నోరుముయ్యవోయ్ నాగమ్మ:! వోయ్ ... ఖాళీబస్తా ఇటు తగలేయి మిల్లుకి పోతా.

సీ: విస్సాయి వెడతాడుగా

జా: లాభంలేదు. వాడువెడితే పాతబాకీలు ఏకరువు పెడతాడు షావుకారు మల్లయ్య.

వి: వాడికి చెప్పేశాగా ఫస్టుతారీఖుకని—వాడికన్న మాటేమిటి పాలవాడికి చెప్పేశా ఫస్టకని. పుల్లల అడితీవాడికి చెప్పేశా ఫస్టకని ......

జా: ఓరి నీదుంపతెగా హోరెత్తించేస్తున్నావేమిరా?

వి: ఏఫస్టుకో ఎవరికీ చెప్పలేదులే నాన్నా.

సీ: మీరు చొక్కామార్చి మరీవెళ్లండి. ఏమిటా మాసినచొక్కా మీరూను?

(వారం రోజుల తరువాత)

రాజు: వొదినా ఏమిటి పెట్టె తెగ సర్దేస్తున్నావు ?

సీ: (మవునం)

రా: (గాబరాగా) అట్లా ఖాళీగా చూస్తావేమిటి వొదినా ?

సీ: ఏమీలేదు వాయనా

రా: చెప్పగూడదా ? ఏమిటమ్మా దిగులా ?

సీ: (నీరసంగా) ఒంట్లో బాగుండలేదయ్యా అదేమిటో కాళ్లు చచ్చుబడి పోతాయి. . . కొంచెం పనిచేస్తే చాలు నీరసం. . .

రా: అయితే ఆసుపత్రికి పోయిరానా ?

సీ: మొన్ననేగదా అమ్మణ్ణికి జలుబు చేస్తే నాలుగు రోజులు ఆసుపత్రి చుట్టూ తిరిగితివి కదా... మళ్ళీ ఆసుపత్రికి తరమనా నిన్ను ? ఈ ధర్మాసుపత్రికి దీందుంపతెగా పొద్దున్న 7—30కి వెడితే మిట్టమధ్యాన్నానికి అరఖు నీళ్లు గుంజుకు రావడం కనాకష్టం.

రా: అట్లా అని మందు మానుకుంటారాయేం?

విస్సాయి:నీరసమా అమ్మా? అయితేనే పళ్లూ పాలూ, కోడి గుడ్లూ తినవమ్మా..... యాపిల్సు, ఎర్రటి యాపిల్సు తిన్నావంటే నెత్తుర్లో జీవకణాలు వోః బిలబిలా అయోర్టాలో నిండిపోతై...

సీ:పోనీ రాజూ మన డాక్టరు గోవిందంగారిదగ్గరకు పోయి.........

రా:(ఆర్తోక్తిలో) అన్నయ్య కచ్చితంగా చెప్పాడు వదినా రోగం రానీ రొస్టు రానీ, ధర్మాసుపత్రికి పొండి ప్రైవేటు డాక్టరు దగ్గరికి ససేమిరా పోవద్దు అన్నాడు. ....అందులోనూ



ఎవరుముందుతింటారో..

— యస్. రామకృష్ణ

మన గోవిందం డాక్టరికి మనిషి కనబడితే మనీపర్సు అనుకుంటాడు.

సీ:ఆయన కేసంతా వెదికానిందాక కాని లేదు రిక్షాకి.....ఒరే విస్సీ...నాన్నారితో అనే పుస్మి నువ్వూ నేనూ ఆయన సూట్‌కేసు వెదికామని....తారా జువ్వలా లేచి పోతారాయన.

వి: భేష్...అసలు ముట్టుకోనేలేదంటూ, నాకు తెలీదా యేం.

సీ:ఈ బస్తీక బదిలీ అయిం తర్వాత తల ప్రాణం తోకకు వస్తోందయ్యా.....పనిమనిషికి 5రూపాయలు! వాకిలివూడిచేందుకూ, అంట్లు తోమేందుకూను, అంతా జేసి.....పైగా, నెలకి పది నాగాలైన పెడుతుంది. పీడాబోయిరి....నేను తంటాలు పడతాలే...అని తీసిపారేశామె...అయిదు రూపాయలు మిగులుతాయికాని, పని తెమలకుండా వచ్చింది మరీను.

రా:తీసి పారేస్తే ఎట్లాగమ్మా?

సీ:మీ అన్నయ్య అట్లాగే అంటారు.....మరి తీసివెయ్యక పోతేఖర్చులెలా తగ్గుతాయో చెప్పరు...(ప్రశాంయిస్తూ) మీ అన్నయ్యతో చెప్పవుగదా, ఒక వుపాయం వుందోయ్ రాజూ.

రా:చెప్పు.

సీ: ఇప్పుడు అంబర్ చర్కాలని ఏవో వస్తున్నయ్యటగా....దాని మీద వంటింటో కూచుని దారం తీస్తేనో? కాలవ అవతల అగ్గిపెట్టెల ఫాక్టరీ ఉన్నదటగా.....అక్కడికి వెళ్ళనే అక్కర్లేదట. పుల్లలు పేర్చి యిస్తే ఇన్ని పెట్టెల కింతాఅని ఇస్తారట. ....అవతల వీధిని లక్ష్మమ్మని ఒకావిడ ఇట్లానే నెలకిరవై నాల్లుతుంది. ఇంట్లో బెడద యినా తీరుతుంది. ఎం చక్కటి చీరెలు కడుతుందనుకున్నావు? నాయున్నాయన కొన్నాకను క్కొనిచెబుదూ

రా:(నవ్వుతో) భలే మాటలమ్మా....ఇప్పటికే పని తెలియక సతమతమై పోతుంటేని. .. ఇవన్నీ పెట్టుకొని ఎట్లా నిభాయించు కోగలమమ్మా?. నేను చెప్తానుగాని నువ్వు మొట్ట మొదటటాని క్కులు తీసికోవాలమ్మా.

సీ:సరిపోయింది ....నాలుగు రాళ్లు కళ్లబడితే నలభై టానిక్కులు కొనవచ్చు.

రాజు:(నవ్వుతో)వూరికెనేబెంగపెట్టుకోకువదినా.. నాకు ట్యూషన్ అక్కర్లేదు...నేను మానేస్తా గాని నువ్వు పనిమనిషిని పెట్టుకో ముందు ఒక హద్దు దాటం తర్వాత ఎంత కక్కుర్తి పడితే అంతకు రెండింతలు ఖర్చవుతుంది.

సీ:( నిస్పృహతో) మరినువ్వు ట్యూషన్లు మాని అసుపత్రులమ్మట తిరుగుతుంటే నీచదువు ఏమయ్యేనో.... వూళ్లో చూడబోతే ఎక్కడ చూసినా అప్పులే. నెలనెలా కొంచెంగానే పెరుగు తున్నాయనుకో...ఇక రేపోమాపో చుట్టు ముట్టే స్తాయి.

రా:అదుగో ఆధ్యాస మాను వదినా..క్రమ క్రమేణా అన్నయ్య వైఖరి వచ్చేస్తోంది నీకు .... అసలు సుస్తీ ఏమిటో చెప్పకుండా.........

వి:(అర్థోక్తిలో) అదేమిటి బాబాయ్ అమ్మ చెబు తున్నది సుస్తీలు కావాయే?....అయినా మన ఇంట్లో బొగ్గుపులుసుగాలి ఎక్కువయి పోతోం దిబాబాయ్.

సీ:వీడిదోగోల!

వి:(ఆరిందావలె) లేకపోతే ఏమిటమ్మా....ఆచిన్న గదిలో అయిదుగురం నిద్రపోతున్నామా? అంత మంది ప్రాణవాయువు పీల్చి బొగ్గుపులుసు వాయువు ఉత్పత్తి చేస్తుంటేరి. రోగాల సూక్ష్మ జీవులు వృద్ధి పొందుతూ? బాబాయ్ ఫ్రండ్స్ ఇంట్లో సర్దుకున్నాడు కాబట్టి సరిపోయింది.

సీ: చూచిచూచి ఎట్లాంటి ఇల్లు అమరిందో చూడు. ఒక్కగదీ, ఒక వంటగదీ....ఈ కొండ గుహకి నెల1కి రూ 25.

వి:యన్ (దర్జాగా)ఈ గదే రాత్రి బెడ్ రూమ్. పొద్దున్న ఆఫీసు రూమ్....నాన్నగారు కచేరికి వెళ్లింతరువాత డ్రాయింగురూమ్. సాయంత్రం చిన్నలేడీస్ క్లబ్ .... సాయంత్రం నాన్నగారు ఆఫీసువించి రాగానే......

సీ: (అర్థోక్తిలో) పెద్ద యుద్ధరంగం! అసలు ఈ బెంగలకన్నా నన్ను క్రుంగదీస్తూవున్నది మరొకటి రాజా—

రా: అదే నాకు కావాలి.

సీ: చూస్తున్నావుగా మీఅన్నయ్య వరస ..నరాలు తోడేస్తున్నారు. ఇల్లు నరకకూపం చేస్తు న్నారు. ఈమాట అనవచ్చును, ఈమాట అనకూడదు అన్న విచక్షణ లేదుగదా— ఆయన ఇంట్లో వున్నంతసేపూ నాగుండె అతి వేగంగా కొట్టుకుంటుంది. రాజా రెక్కలు విరుచుకోగలను. నిద్దరలేకపోయినా — ఆహారంలేకపోయినా — విరామం లేకపో యినా ఒళ్లు హూనమయి పోతున్నా తల వంచుకుని పోగలను. అతకన్న ఏమి చెయ్య గలను. చావనా? (నిట్టూర్పు) నిజానికి అది చాలా సులభం.

రా: (అనునయంగా) ఏమి మాటలమ్మా అవి.. అన్నయ్యకి ఒక్కటే ధ్యాస ఒదినా. వందజీతంలో ఇమడాలి జీవితాలు. ఇహాను ఎటువేపూ చూడరు. వందా ఇక పెరగదు. ఆపెంచే తీరికా ఓపికా స్థిమితమూ ఆయ నకు లేవు.

సీ: వందకాదు. ఏనభైలో ఇమడ్చాలని వుంది నాకు సాధ్యమా?

రా: అన్నయ్యకి మనస్థిమితంలేదు ఒదినా.. ఈఅప్పులెట్లా తీరతయ్యా అని పట్టుకుం దాయనకి.

సీ: మరి ఈమధ్య ఇంకో వంతపాట ప్రారంభిం చారు. పో—పో పొమ్మనడం. ఎక్కడికో?

రా: అందుకనా పెట్టె సర్దుతున్నావూ?

సీ: నీకు తెలీదు నాయనా చాలా దూరం వెళ్లింది.

రా: ఆ!

వి: అమ్మోవ్ — నాన్న దూకుడుగా వచ్చేస్తు న్నాడు. ఎక్కడేనా తలదాచుకోవాలి. పోతా.. (నిష్క్రమణ)

జానకిరామయ్య: (వస్తాడు) నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ దిరా?

రా: ఇంకా ఇవ్వలేదు.

జా: (కోపంగా) ట్యూషను మానావట యేం?

రా: ఆయనే మానుకున్నారు .... జీతమెక్కువ కావాలో యేమో.

జా: ఆయన వాతో ఇప్పుడు దారిలో కనబడి చెబితే? నువ్వే రావటం లేదట! .... నీ యిష్టమేనేమిరా?.

రా: (మవునం)

జా: నాసూట్‌కేసులో కాయితాలెవళ్లు కెలి కారు?

(ఎవరూ మాట్లాడరు)

జా: (గర్జిస్తూ) ఎవరూ మాట్లాడరేమ్రా?

వి: (వచ్చి, కంఠతిబిగించి) నీచిన్న సూట్‌కేసేనా?

జా: అవును.

వి: అమూల వుందీ?

జా: అదే అదే.

వి: ఆఫీసు కాయితాలూ, గుండుపిన్నీసుల డబ్బా అదీ వున్నదీ?

జా: (గట్టిగా) ఇహనే?: కెలికావన్నమాట!

వి: అబ్బే—అమ్మా నేనూ అసలా సూట్‌కేసు తెరవందే. అందులో రిక్షాకి డబ్బులులేవుగా.

సీ: (భయం భయంగా) ఇందాక రిక్షాకి డబ్బు లున్నయ్యేమోనని వెతికానండీ.

జా: నువ్వేనా? అనుకుంటూనేవున్నా. నాకు తెలీదూ? నేను డబ్బులేమైనా దాచుకున్నా నేమోనని నీకనుమానమేగా?

సీ: నాకట్లాంటి అనుమానాలు లేవు. దాచు కుంటే దాచుకుంటారు తప్పా?

జా: (కోపంగా) నిన్ను తగలేసిరి. ఒకసారా రెండు సార్లా లక్షసార్లు చెప్పాను. చిలక్కి చెప్పి నట్టు చెప్పాను. నాసూట్‌కేసు కెలకవద్దూ అని — బుద్ధిలేదూ? కుక్కనయం.

సీ: ఏమంటున్నారయా?

జా: ఫీ. పో.

సీ: పోతాన్లెండి.

జా: పోతానుపోతాననే సంగనాచులు పోగా చూడ లేదింతవరకూ.

సీ: చూస్తారులెండి.

జా: (వెళ్లిపోతాడు)

సీ: చూశావా రాజా ఇదీవరస—మాఅన్నయ్య వుత్తరం వ్రాశాడు రమ్మనమని— అమ్మ ణ్ణినీ విస్సాయినీతీసికెడతాగాని—అన్నయ్యతో చెప్పు నాయనా.

రా: ఇట్లా లుకలుకలు పడి వెళ్లగూడదు వదినా! నేను చెబుతాగా? ఆయన తీరే అది. నీవెర గవా?

సీ: (భారంగా) కాదోయి రాజా. ఆయన వుద్దేశ్యం నీకు తెలియదు. వెడతామరి .... .. ఇల్లు జాగర్త. ఆయనవసతే ముక్కోపి ... కని పెట్టు ..... అన్నం తినకుండా గూడా ఆఫీ సుకి పరిగెట్టగలరు. ఆవుగ్రమంతా ఆ హెడ్డుగుమాస్తా మీద చూపిస్తే మొదటి కొస్తుంది. ఉన్నదికాస్తా ఊడిచక్కాపోతుంది విస్సీ, రా నాయనా — అమ్మా —

(నిష్క్రమణ)

జా:(వచ్చాడు) ఏమేవ్ .... వంటచావ్వున గానీ ..... ఆఫీసుకి పోవాలి మళ్లీ.

రా:(ముక్తసరిగా)వంటయింది. భోజనానికిలేవండి

జా:వదినేదీ?

రా:వెళ్లింది.

జా:ఎక్కడికి?

రా:ఎక్కడికి వెడుతుంది? పుట్టింటికి.

జా:ఇప్పుడు దేనికి?

రా:ఎందుకన్నాయ్ నటనా?

జా:నటనా?

రా:మరినీకు తెలీదా ఎక్కడికి వెళ్లిందో ఎందుకు వెళ్లిందో ?

జా:(అర్థంచేసుకోంటూ)తెలుసుననుకో.(వట్టువ) అవ్రా? తెలుసును. నేనే పంపాను. (ఆవేశంగా) వెళ్లమని చెప్పకండా వెళ్లగొట్టాను.ఎక్కడవుండి పోతుందోనని కవ్వించి కవ్వించి వెళ్ల గొట్టాను. అడవి జంతువుని వేటాడినట్టు తరిమి తరిమి హింసించి మరీ వెళ్ల గొట్టాను. (సాలోచనగా) వెళ్లింది....చాలా సార్లు వెళ్లింది...కాని ఇట్లా ఏ నాడూ వెళ్లలేదు.

రా:సరే....మీ సంకల్పమీడేరిందిగా. లేవండి భోజనానికి. దేనికివెళ్లగొట్టాలని అంత తపన మీకు?

జా:ఎట్లారా మరి? వూరి నిండా అప్పులు... బట్టల కొట్టులో ...పచారీకొట్టులో...కిరాణా కొట్టులో ....ఇవి తీరేదెట్లా?

రా:వదినని పంపించి వేస్తే తీరతయ్యా? నన్ను వెళ్లగొట్టరాదూ కావలసినంత ఖర్చు తగ్గుతుంది.

జా:నీకు తెలీదురా...ఒక్కనాలుగు నెలలుండనీ... మన మిద్దరమూ ఏదో రెండు గింజలు ఉడకేసుకొని తిందాము. నాలుగు రాళ్లు వెనకేస్తిమా ఈ గ్రహణంలోనించీ బైట పడితే తరవాత వెలుగొస్తుందేమో చూదాం. ఏం చెయ్యను? ఆ స్థితికి వచ్చాను. నువ్వు ఛీ అను ఛా అను నీచమను హీనమను, పశువునను, బండరాయినను అప్పులు తీరితే చాలు.

రా:(ఆధుర్దాగా) ఇదిగో తీర్చేస్తున్నా—ఇవాళ్టి నుంచీ చదువు మానేసున్నా నువ్వు వద్దన్నా సరే.

జా:పిల్లేదు......మానేస్తావా? ఈ స్టేజీలో? మతి పోయిందా?

రా:పోవడానికి మతి అంటూ ఒకటి మిగుల్చుకోవాలని చూసున్నా.

జా:అమ్మ నిన్నయినా పెద్ద చదువు చదివించమందిరా.

రా:ఆవిడ బ్రతికుంటే బలవంతానమానిపించేది. చచ్చేముందు కాబట్టి నీ దగ్గర వరం పుచ్చుకొని చక్కాబోయింది. బ్రతికున్నవాళ్లని సుఖపెట్టాలన్నాయ్. ఎంత చదివినా వచ్చే వుద్యోగమేమిటో నాకు బాగా తెలుసు. అది ఇప్పుడే వెతుక్కుంటాను.

జా:(నిరాశగా) నాకు మల్లేనే నీ బ్రతుకూ ఏ గుమస్తాగిరిలోనో హత మారిపోవాలని వుందేమో.... నువ్వయినా హాయిగా, ధీమాగా నిబ్బరంగా, తడుముకోకుండా, ఒక మనిషిగా, నిండుగా బ్రతుకుతుంటే చూడాలనుకొన్నాను రా.....

రా:(హేళనగా)వదినని వెళ్లగొడితే అప్పులు తీరతయ్యా.... కూరమిగల చప్పిడి మెతుకులు తిని కాలక్షేపం చేస్తున్న వదినని, పాత చీరెలు చించి బట్టల కొట్టు బాకీ తగ్గుతుందని అమ్మణ్ణికి గౌనులు కుడుతున్న వదినని, చాకలిని మానిపించి మీ పంచెలు రోజువిడిచిరోజు 'టినోపాల్' పట్టించి గుంభనగా దొడ్లో చాకిరేవు పెడుతున్న వదినని మూడు నెలలు పుట్టింటికి పంపిస్తే అప్పులన్నీ హరించి పోతయ్యా!......నేనింక చస్తే ఈ ఇంటికి బరువు కాను. నేనూ సంపాయిస్తాను. ఎంతో కొంత వేన్నీళ్లకి చన్నీళ్లు.... ఈ సంసారం కుదుట పడితేనే గాని నేనసలు పెళ్లి చేసుకోను.

రా:కాని నీకొక రహస్యం తెలీదనుకొంటాను అన్నాయ్ (తాపీగా) వదిన నువ్వువెళ్లగొట్టావనే వెళ్ల లేదు.

జా:కాదురా నాయినా నేనే పట్టు బలవంతాన మెడపట్టి బైటికి గెంటినట్టు వెళ్లగొట్టాను. కాని...ఇది దేనికొచ్చిందో లే....

రా:(చటుక్కున) గ్లాస్కోడబ్బాలకు డబ్బుకూడ బెట్టమని వెళ్లింది వదిన.

జా: (నివ్వెరబోయి)నిజంగా? నాకెప్పుడూ చెప్ప లేదే?

రా:ఎట్లా చెబుతుంది? దేవుడిచ్చిన వరం శాపం కింద మారుస్తారయేమీరు. చెబితే ఇంకేమయినా ఉన్నదా? చెప్పలేకనే వెళ్లి పోయింది. మీరు ఇంట్లో అడుగు పెట్టటం తరువాయి ఉరుములూ మెరుపులూనాయె.

జా:(నీరసంగా) ఇంక ఉరుములూ కాదు మెరుపులూ కాదు రా నాయనా తుఫాను వస్తోంది.

రా:(నవ్వుతో) నిర్భయంగా ఉండండి చెప్తా.

—నిప్పాణి గిరిధర్

'సాసువుల నీడల క్రీడలు'

